సాక్షి
వికారాబాద్
మంగళవారం । 9 । జనవరి । 2024



సరికొత్త హంగులు

పేద విద్యార్థులు నేటి పోటీ ప్రపంచానికి సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో కేంద్రం పీఎంశ్రీ పథకాన్ని ప్రారంభించింది. 8లో▸



ప్రజాధనాన్ని దోచుకున్న..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆరోపించారు. 8లో▸



'ఆసరా' అందక ఆందోళన

వృద్ధాప్యంలో ఇబ్బందులకు గురౌతున్నా.. తమ గోడు వినే నాథుడే లేరని పింఛన్ దారులు ఆందోళన వ్యక్తంచేశారు. 9లో▸

న్యూస్‌రీల్

సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- 'ప్రజావాణి'కి 106 అర్జీలు



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 106 అర్జీలు వచ్చాయి. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణ తోకలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటిని సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. టీం లీడర్లు ప్రతిరోజూ రెండు షిఫ్టులలో పని చేయాలన్నారు. ఉదయం, సాయంత్రం పది మంది చొప్పున రోజుకు 1,000 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుదారుల ఆధార్ నంబర్, రేషన్ కార్డు నంబర్, మొబైల్ నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, పట్టాదారు పాసు బుక్కు నంబరు, ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డు నంబర్లు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తు ఫారాల్లో సరైన సమాచారం లేకుంటే సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ ప్రక్రియను శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ సంవత్సరం మంచి ఫలితాలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 11న నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులందరూ తమ నివేదికలతో తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

స్పీకర్‌కు సన్మానం



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ వికారాబాద్ నిర్వాహకురాలు మధు అక్కయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులతో ప్రత్యేకాధికారిణి దేవి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని కుల్కచర్ల మండల కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారిణి దేవి అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కబడ్డి పోటీలలో కేజీబీవీ విద్యార్థులు ముగ్గురు అండర్–18 విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా జట్టుకు ఎంపికైన రేణుక, ప్రియాంక, అంజలిలను పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు.



తాండూరులో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

'డబుల్'.. ట్రబుల్

జిల్లాకు మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 3,800

- వచ్చిన దరఖాస్తులు 12,205
- పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లు 1,031
- ఐదు నెలల క్రితమే క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన
- పంపిణీలో తీవ్ర జాప్యం
- కొత్త ప్రభుత్వంపై ఆశలు

వికారాబాద్: జిల్లాలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుండగా.. పూర్తయిన ఇళ్లను అర్హులకు పంపిణీ చేయడంలో అంతే జాప్యం చేస్తున్నారు. తాజాగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే జిల్లాలో ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు ఎప్పుడు కేటాయిస్తారనే విషయంలో స్పష్టత లేకుండా పోయింది. ప్రభుత్వం కూడా మారడంతో గతంలో స్వీకరించిన దరఖాస్తుల ప్రకారమే ఇళ్లు కేటాయిస్తారా ? లేక కొత్తగా మళ్లీ దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వం వీటి విషయంలో అధికారికంగా ఏ నిర్ణయం తీసుకోనప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఈ ఇళ్లు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఇంకా ఏ ప్రకటన చేయకపోవడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల కథ కంచికేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,031 డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తయ్యాయి. మరి కొన్ని చోట్ల తుది మెరుగులు, చిన్న చిన్న పనులు మినహా పూర్తయ్యాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెండుసార్లు అధికారులు విచారణ సైతం పూర్తి చేసినా గత ప్రభుత్వం ఇళ్లను పంపిణీ చేయలేదు. ఇళ్లు దెబ్బతినక ముందే పంపిణీ చేయాలని పేదలు కోరుతున్నారు.

క్షేత్రసాయిలో పరిశీలన పూర్తి

క్షేత్రసాయిలో దరఖాస్తుల పరిశీలనకు ఐదు నెలల క్రితం ముగ్గురు అధికారులతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ బృందంలోని అధికారులు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టారు. 50శాతం అర్హులు ఉన్నట్లు తేల్చారు. రెండో దఫా పరిశీలన పూర్తి చేసి నెలలు గడుస్తున్నా వాటిని పేదలకు ఇళ్లను పంపిణీ చేయలేదు. జిల్లాలో 1,031 ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. గత మార్చిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లకు కరెంటు, రంగులు వేయడం, నీటి సౌకర్యం తదితర పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. ఆ మేరకు అధికారులు పనులు పూర్తి చేశారు.

ఇళ్ల సంఖ్య కుదింపు

జిల్లాకు మొదటి దశలో 5,740 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. 2016లో నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆ తరువాత ఇళ్ల సంఖ్యను 3,800కు కుదించారు. ప్రస్తుతం 2,257 ఇళ్లు నిర్మాణ దశలో ఉండగా ఉన్నాయి. వీటిలో 1,031 ఇళ్లు చిన్న చిన్న పనులు మినహా పూర్తి కావచ్చాయి. 1,543 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ధారూరులో 120, మర్పల్లిలో 120, యాలాల్ మండలం కోకట్‌లో 180, తాండూరు పట్టణంలో 401, పరిగిలో 180, చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో 30తో కలిసి మొత్తం 1,031 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వీటి కోసం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తులు స్వీకరించారు. అయితే 12,205 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

బోనాల సంబరాలు



పెద్దేముల్: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ దేవతకు ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం పెద్దేముల్ మండలం నాగులపల్లిలో గ్రామ దేవత జాతర వైభవంగా జరిగింది. మూడు సంవత్సరాలకు ఒక్కసారి జాతర నిర్వహిస్తారు. మహిళలు డప్పు వాయిద్యాల మధ్య బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

'ఆధార్' అవస్థలు



తాండూరు పోస్టాఫీసు వద్ద టోకెన్ల కోసం గుమిగూడిన జనం, (ఇన్‌సెట్‌లో) ఆధార్ సెంటర్ వద్ద జాగారం చేస్తున్న ప్రజలు

తాండూరు టౌన్: ఆధార్ కార్డు అప్‌డేట్ తప్పని సరి అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో దాదాపు నెల రోజులుగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాండూరు పోస్టాఫీసులో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేవైసీ కోసం నిత్యం వందలాది మంది వస్తున్నారు. అయితే కేవలం పరిమిత టోకెన్లు మాత్రమే ఇస్తున్నారు. దీంతో మిగిలిన వారు మరుసటి రోజు సెంటర్‌కు వస్తున్నారు. టోకెన్ల కోసం అర్ధరాత్రి నుంచే చలిలో ఆధార్ సెంటర్ వద్ద జాగారం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. బషీరాబాద్‌లోని ఆధార్ సెంటర్‌ను తాత్కాలికంగా తాండూరు పట్టణానికి తరలిస్తామని ఇటీవల ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పినా అది అమలు కాలేదు.



నమాజ్ చేస్తున్న ముస్లింలు

అల్లాహ్‌పై విశ్వాసంతో జీవించాలి

- తబ్లీగీ జమాత్ చీఫ్ మౌలానా జెన్‌షాద్ సాబ్
- పరిగిలో ముగిసిన ఇస్తెమా
- పాల్గొన్న ఐదు లక్షల మంది ముస్లింలు

పరిగి: అల్లాహ్‌పై విశ్వాసంతో జీవించాలని ఢిల్లీ నిజాముద్దీన్ ముస్లిం మత పెద్దలు, తబ్లీగి జమాత్ చీఫ్ మౌలానా జెన్‌షాద్ సాబ్ అన్నారు. పరిగి పట్టణంలోని న్యామత్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరుగుతున్న ఇస్తెమా సదస్సులు సోమవారంతో ముగిసింది. అంతకుముందు ముస్లిం మత పెద్దలు మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ప్రతి రోజూ భోజనం చేసే సమయంలో ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇచ్చి ఆదుకోవాలని సూచించారు. ఖురాన్‌ను ప్రతి ఇంట్లో ఉంచుకోవాలని, ప్రతి రోజూ పఠిస్తూ అల్లాహ్ చూపిన మార్గంలో జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 5లక్షల మంది ముస్లింలు పాల్గొన్నారు. చివరి రోజు సదస్సును కలెక్టర్ నారాయణరెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పరిశీలించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సదస్సుకు వచ్చి ముస్లింలకు మంచినీళ్ల బాటిళ్లు, అన్నం పొట్లాలు అందజేశారు. పరిగి నుంచి వికారాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే వారి కోసం వాహనాలను సమకూర్చారు.



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

శరవేగంగా అభివృద్ధి పనులు

- కడా కార్యాలయం ప్రారంభం
- ఉపాధి అవకాశాలకు ప్రణాళిక
- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



కొత్త కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా పురోహితులు కిట్టుస్వామి, లక్ష్మీనారాయణ జోషీ పూజ జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతాయని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. విద్య, వైద్యం, రవాణా, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కడా కార్యాలయం పని చేస్తుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం చేయాల్సిన పనులను పరిశీలిస్తామన్నారు. మండల పరిధిలో సున్నపురాయి నిల్వలు ఎక్కువగా దొరికే అవకాశం ఉందన్నారు. సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు. తాండూరు సమీపంలో ఉన్న కాగ్నా నది నుంచి నీటిని వినియోగించుకోడానికి అవకాశం ఉందన్నారు. డెవలప్‌మెంట్ విషయంలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు గుర్తించి యువతకు ఉపాధి కల్పించేందుకు వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయడం కోసం సీఎం ప్రత్యేక కార్యదర్శి రాణి కుముదిని కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లో పర్యటించినట్లు తెలిపారు. కొడంగల్ నుంచి చేవేళ్ల ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన గురుకుల పాఠశాలలకు స్థలాలు కేటాయించి ఇక్కడే పక్కా భవనాలను నిర్మించడానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు 24గంటల పాటు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి కోరారు. ప్రస్తుతం 50 పడకలుగా ఉన్న ఆస్పత్రిని త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. సోమవారం ఆయన కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. వైద్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, వైద్యులు సనాకేత్, శ్రావణి, వీణ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో.. రూ.10లక్షల కోట్ల అప్పు

- ఇంకా ఎన్ని ఉన్నాయో తేల్చేపనిలో ప్రభుత్వం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులు ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తేల్చారని, ఇంకా ఎన్ని లక్షల అప్పులు ఉన్నాయో తేల్చే పనిలో ప్రభుత్వం ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపించారు. ధారూరు మండలం కొండాపూర్ ఖుర్దు గ్రామంలో నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి రూ.7 లక్షల విరాళంతో నిర్మించిన వాటర్ ప్లాంట్, ప్రత్యేక గదిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుల ఊబిలోంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి, ఆరు గ్యారంటీల అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు మాజీ సీఎం ద్రోహం చేసి తాగు, సాగునీరు రాకుండా చేశారని విమర్శించారు. పదేళ్లుగా ఈ ప్రాజెక్టును మరుగున పడేశారని అన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్నందున బీఆర్ఎస్ మాజీ సీఎంను ఏం అనలేక పోతున్నానని అన్నారు. జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తాగునీరు అందించడానికి తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సర్వే కోసం రూ.7 కోట్లు తీసుకొచ్చానని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రాణహిత – చేవెళ్ల, జూరాల ప్రాజెక్టులు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. తాను స్పీకర్‌గా ఉన్నా అన్ని శాఖల ద్వారా నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని తెలిపారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ. వందల కోట్లు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటిని బాగు చేసేందుకు రూ.400 కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి ఇందిరమ్మ పాలన అందిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సహాయం తీసుకోకుండా మూడు గ్రామాలను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారంటే అది గ్రామ సర్పంచ్ నర్సింహారెడ్డి ఘనతేనని కొనియాడారు. కాగా స్పీకర్ వెళ్లిన కొద్ది సేపటికి జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహారెడ్డి, కేరెల్లి సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మాజీ సలహాదారు పెంటారెడ్డి, ధర్మాపూర్, రాంపూర్ తండాల సర్పంచులు అనిల్, పాండునాయక్, మాజీ జెడ్పీటీసీ రాములు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



సిబ్బందితో వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

హుడాకాంప్లెక్స్‌: డెంగీ, మలేరియా, క్షయ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సరూర్‌నగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించాలని.. అనుమానిత కేసులు గుర్తించి చికిత్స సకాలంలో అందించాలని సూచించారు. వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి గీత, పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరమణ, సీహెచ్‌ఓలు జ్ఞానేశ్వర్‌, రఘు, చంద్రశేఖర్‌ సిబ్బంది ఆంజనేయులు, భాను పాల్గొన్నారు.

పత్తి ట్రాక్టర్‌ బోల్తా.. తప్పిన ప్రమాదం

చేవెళ్ల: పత్తిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ఘటన చేవెళ్ల మండలంలోని ఖానాపూర్‌ బస్‌స్టేజీ సమీపంలో సోమవారం జరిగింది. మండల పరిధిలోని రామన్నగూడ గ్రామానికి చెందిన రైతు విఠల్‌ తన పొలంలో పండించిన పత్తి దిగుబడిని అమ్ముకునేందుకు ట్రాక్టర్‌లో లోడ్‌ చేసి వికారాబాద్‌కు తీసుకెళ్తున్నాడు. ఖానాపూర్‌ బస్‌స్టేజీ సమీపంలోకి రా గానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించడానికి ట్రాక్టర్‌ డ్రైవర్‌ ఒక్కసారిగా పక్కకు తిప్పే ప్రయత్నం చేయటంతో వెనక ట్రాలీలో లోడ్‌ ఉండటంతో ఒక్కసారిగా ట్రాలీ పల్టీ కొ ట్టింది. వెంటనే ట్రాక్టర్‌పై ఉన్న రైతు విఠల్‌, డ్రైవర్‌కు కిందికి దూకారు. దీంతో ప్రమాదం తప్పింది.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరి మృతి

ఇబ్రహీంపట్నం: కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన సిద్దగొని శివకుమార్‌(31), ఎస్‌కే రహీం (45)లు బైక్‌పై బొంగుళూర్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. హైదరాబాద్‌ వైపు వెళ్తున్న కారు ఖానాపూర్‌ గ్రామ సమీపంలోని జేబీ వెంచర్‌ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌ నడిపిస్తున్న శివకుమార్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రహీంకు తీవ్రగాయాలు కావడంతో నగర శివార్లలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కారును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన ఎండీ జూనైద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందడంతో చింతపట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పేద కుటుంబానికి చెందిన శివకుమార్‌, రహీంలు డ్రైవింగ్‌ వృత్తిలో ఉన్నట్లు సమాచారం. వీరి మృతితో ఇరు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.

సర్కారు బడికి సరికొత్త హంగులు

పేద విద్యార్థులు నేటి పోటీ ప్రపంచానికి సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రారంభించింది. వికారాబాద్‌ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు.

- ‘పీఎంశ్రీ’ కింద మొదటి విడతలో పాఠశాలల ఎంపిక
- మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనులు
- విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు కసరత్తు



వికారాబాద్‌లోని సోషల్‌ వెల్ఫేర్‌ పాఠశాల

వికారాబాద్‌ అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునే విధంగా విద్యాబోధన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గతేడాది సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కలిసి పీఎం(ప్రధాన మంత్రి స్కూల్స్‌ ఫర్‌ రైజింగ్‌ ఇండియా) పథకానికి నాంది పలికింది. ఈ పథకం ద్వారా జిల్లాలోని 21 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, తరగతి గదులు, సైన్స్‌ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకంలో ఎంపిక చేసిన పాఠశాలలకు నిధులు సైతం విడుదల చేసింది. బడ్జెట్‌ కేటాయింపుల్లో కేంద్రం విడుదల చేసే నిధులు 60 శాతం ఉండగా, మిగతా 40 శాతాన్ని రాష్ట్ర సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ నిధుల ద్వారా పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పాఠశాలలను, ఇప్పటికే కొన్ని మౌలిక వసతులున్న బడులను పీఎంశ్రీ కింద ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందించేలా ఈ స్కీంను రూపొందించారు. విద్యార్థుల మెదడుకు మరింత పదును పెట్టి, పాఠశాల దశలోనే వారిలోని ప్రతిభను వెలికి తీయాలని భావిస్తోంది.

నూతన పద్ధతుల్లో బోధన

జిల్లాలోని 174 జిల్లా పరిషత్‌, 116 యూపీఎస్‌, 764 పీఎస్‌, 18 కేజీబీవీ, 9 మోడల్‌ స్కూల్స్‌, 26 సోషల్‌ వెల్ఫేర్‌ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 90 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పీఎంశ్రీ పథకం కింద మొదటి విడతలో 21 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇప్పటికే కొన్ని బడులకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. పథకం ద్వారా మౌలిక వసతులు పెంచి ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు. పాఠశాలల్లో సంప్రదాయ విద్యా విధానాలకు స్వస్తి పలికి, నూతన పద్ధతుల్లో బోధన చేసే విధంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠ్యాంశాలతో పాటు బోధన పద్ధతులను నాలుగు కేటగిరీలుగా విభజించించారు. ఫౌండేషనల్‌, ప్రిపరేటరీ, ఇంటర్మీడియట్‌, సెకండరీ లెవల్స్‌గా పేర్కొన్నారు.

ప్రయోగశాలలకు రూ.16 లక్షలు

మొదటి విడతలో ఎంపికైన 21 పాఠశాలల్లో తొమ్మిదింటిలో ప్రయోగశాలలు ఏర్పాటు చేయనున్నారు. అందుకు గాను ఒక్కో ల్యాబ్‌కు సుమారు రూ.16 లక్షలు వెచ్చించనున్నారు. ఈ నిధులతో లేబొరేటరీలు, పరికరాల కొనుగోలు, అత్యాధునిక తరగతి గదులు, ఫర్నిచర్‌, కంప్యూటర్‌ బోధించే ఉపాధ్యాయుల నియామకం తదితర వాటిని చేపట్టనున్నారు. టీఎస్‌ఈడబ్ల్యూడీసీ ఇంజినీరింగ్‌ విభాగానికి పనుల బాధ్యత అప్పగించగా, స్కూల్‌ ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ కమిటీలు పర్యవేక్షణ చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలల్లో వసతులు కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

ఎంపికైన పాఠశాలలు ఇవే

- **టీఎస్‌ మోడల్‌ స్కూల్స్‌–** బంట్వారం, పెద్దేముల్‌, పూడూర్‌, తాండూరు.
- **జెడ్పీహెచ్‌ఎస్‌–** బషీరాబాద్‌, ధారూర్‌, దిర్సమ్‌పల్లి, రుద్రారమ్‌, కోట్‌పల్లి, మర్పల్లి, మేకవనంపల్లి.
- **కేజీబీవీ–** నవాబుపేట్‌, నస్కల్‌, సోషల్‌ వెల్ఫేర్‌ తుంకులగడ్డ, యాలాల్‌, వికారాబాద్‌, వికారాబాద్‌(గర్ల్స్‌).
- గవర్నమెంట్‌ స్కూల్‌–1 తాండూరు, ఎంపీహెచ్‌ఎస్‌ చిల్‌మల్‌ మైల్వార్‌, ఎంపీపీఎస్‌ దౌల్తాబాద్‌(గర్ల్స్‌), పులుమద్ది.

సైన్స్‌ ల్యాబ్‌లు ఏర్పాటు



పీఎంశ్రీ పథకం కింద మొదటి విడతలో తొమ్మిది పాఠశాలల్లో సైన్స్‌ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపిక య్యాయి. ప్రభుత్వం నిర్ణయించినట్లు జూన్‌ నాటికి సిద్ధం చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి. మిగత 12 పాఠశాలల్లో తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు నిర్ణయించాం.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి, వికారాబాద్‌

ఉర్సు ఏర్పాట్లకు కసరత్తు

వక్ఫ్‌ బోర్డు అధికారులతో ఎమ్మెల్యే శంకర్‌ చర్చలు

కొత్తూరు: జేపీ దర్గా ఉర్సు ఏర్పాట్లను ఘనంగా చేయాలని షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ వక్ఫ్‌ బోర్డు అధికారులకు సూచించారు. దర్గా ఆవరణలో ఆయన సోమవారం వక్ఫ్‌బోర్డు అధికారులు, స్థానిక వ్యాపారులతో కలిసి ఉర్సు ఏర్పాట్లపై చర్చించారు. కులమతాలకు అతీతంగా భావించే దర్గా ఉత్సవాలకు స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. వారు ఉండడానికి వసతి, తాగునీరు, టాయిలెట్లతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల రద్దీ కారణంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, రవికుమార్‌గుప్తా, సీఐ నరసింహారావు, వక్ఫ్‌బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, పోలీసులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌

విజయమే లక్ష్యంగా..

- 20న జవహర్‌ నవోదయ ప్రవేశ పరీక్ష
- తడబాటు లేకుండా చదవాలి
- ఆరో తరగతి ప్రవేశాలకు చక్కటి అవకాశం
- సూచనలందిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్‌ రూరల్‌ : జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జవహర్‌ నవోదయ విద్యాలయం గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన కార్పొరేట్‌ స్థాయి ఉచిత విద్యను పొందేందుకు చక్కటి అవకాశం. ఈ నెల 20న ఉ. 11.30 నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకు ఆరో తరగతి ప్రవేశాలకు నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. గంట ముందు విద్యార్థులను పరీక్షా కేంద్రానికి తల్లిదండ్రులు తీసుకెళ్లా లి. ప్రవేశ పరీక్షలో విజేతలుగా నిలిచి ప్రవేశం లభిస్తే ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత ప్రమాణాలతో కూడిన సాహసోపేత కృత్యా లు, విలువలు, క్రీడలు, పౌష్టికాహారంతో పాటు సమున్నత శిక్షణ నవోదయ విద్యాలయంలో ఉచి తంగా లభిస్తుంది. ఈ క్రమంలో మున్సిపల్‌ పరిధిలోని పాతకొడంగల్‌ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఇల్లూరి క్రాంతికుమార్‌ నవోదయ పరీక్షలో సీటు పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎ లా చదవాలి అనే అనే అంశాలపై సూచనందిస్తున్నారు.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు..

పరీక్ష రాసే విద్యార్థులు చిన్నారులే కావడంతో తడబాటు లేకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముందస్తుగా మాడల్‌ ఓఎంఆర్‌ సీటుపై చిన్నారులకు అవగాహన కల్పించాలి. సమాధానాలు గుర్తించడానికి నీలి, నలుపు బాల్‌ పెన్‌ మాత్రమే ఉపయోగించాలి. రఫ్‌ వర్క్‌ చేయాల్సివస్తే బుక్‌లెట్‌లోని 16వ పేజీని వినియోగించుకునేందుకు చిన్నారులకు అవగాహన కల్పించాలి. ఒక్కసారి సమాధానం రాసిన తర్వాత మార్చడం, కొట్టివేయడం, దిద్దడం చేయకూడదు. ముందుగా సమాధానం తెలిసిన ప్రశ్నలకు వెంటనే జవాబు రాసే ప్రయత్నం చేయాలి. రాని వాటికి తర్వాత ఆలోచిస్తూ సమాధానాలు రాసే ప్రయత్నం చేయాలి. ప్రతి 30నిమిషాలకు ఓ పర్యాయం గంట కొట్టడంతో సమయాన్ని గమనిస్తూ ప్రశ్నలకు సమాధానాలు రాయాలని చిన్నారులకు వివరించాలి.



మోడల్‌ నవోదయ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్‌)

ప్రవేశ పరీక్ష మూడు విభాగాలు..

మేధాశక్తి పరీక్ష 40 ప్రశ్నలతో 50మార్కులకు సంబంధించి ఒక గంట సమయం, గణితంలో 20 ప్రశ్నలకు 25మార్కులకు అరగంట సమయం, భాషా నైపుణ్యానికి సంబంధించి 20ప్రశ్నలకు 25మార్కులకు అరగంట సమయం కేటాయించుకుంటూ సద్వినియోగం చేసుకోవాలి. 2గంటల వ్యవధిలో వంద మార్కులకు 3 విభాగాల్లో పరీక్ష విరామం లేకుండా జరుగుతుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్‌ రూపంలో ఉంటాయి.

మేధాశక్తి..

మేధాశక్తి విభాగంలో 50మార్కులకు సంబంధించి బొమ్మలతో కూడిన ప్రశ్నలుంటాయని, ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయని, సమయస్ఫూర్తితో ఒత్తిడికి గురికాకుండా ఆలోచించి సమాధానాన్ని ఎంచుకోవడంతో అధిక మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

గణితం..

గణిత విభాగంలో 25మార్కులకు సంబంధించి 5వ తరగతి వరకు అన్ని చాప్టర్లపై చిన్నారులకు అవగాహన పెంచేందుకు కృషి చేయాలి. ఒక్కో చాప్టర్‌ నుంచి ఒకటి లేదా రెండు ప్రశ్నలిచ్చే అవకాశం ఉంటుందని, గణితంలో అధిక మార్కులు సాధించేందుకు కృషి చేయాలని చెబుతున్నారు.

భాషా నైపుణ్యం..

భాషా పఠనాసక్తి విభాగంలో 5పాఠ్యాంశాలు ఇస్తారని, పాఠ్యాంశాల ఆధారంగా ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలు నిశితంగా గమనిస్తూ గుర్తించాలి. మూడు విభాగాలకు సంబంధించి చిన్నారి విద్యార్థులకు తల్లిదండ్రులు, సంబంధిత ఉపాధ్యాయులు పూర్తి అవగాహన కల్పించడంతో నవోదయలో సీటు పొందేందుకు వీలుంటుందని ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్‌ పేర్కొంటున్నారు.

అవగాహన కల్పించాలి



నవోదయ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. తడబాటు లేకుండా ఉండేందుకు ప్రశ్నాపత్రం ఎలా ఉంటుందో, ఎలా మార్క్‌ చేయాలో, సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో సవివరంగా వివరించాలి. ప్రశ్నాపత్రంలో ఇచ్చే అంశాలపై, వాటికి సమాధానాలు రాసే విధానాన్ని విద్యార్థులకు పూర్తిస్థాయిలో తెలియజేయాలి.

– క్రాంతికుమార్‌, హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల, పాతకొడంగల్‌

నీరు వృథా.. ప్రజల వ్యథ



గుక్కెడు నీటి కోసం ఒక్కప్పుడు ఆ ఊరి ప్రజలు బయటికి పరుగులు తీసేవారు. సరిపడా నీరు లభించక ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై రాస్తారోకోలు చేశారు. ప్రస్తుతం అదే గ్రామంలో జలం ధారాళంగా వృథాగా పోతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. ఇదీ బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలో పరిస్థితి. స్థానిక బొడ్రాయి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఇలా నిత్యం బోరు నుంచి నీరు వృథాగా పోతుంది. – బొంరాస్‌పేట

బస్‌షెల్టర్‌ బాగుపడేనా!

మండలంలోని మదన్‌పల్లిలో వన సంరక్షణ సమితీ(వీఎస్‌ఎస్‌) నిధులతో 15 ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్‌ శిథిలావస్థకు చేరింది. గ్రామంలోని బొంరాస్‌పేట-ధారూరు మండలం నాగారం రోడ్డు, పాఠశాల సమీపంలో ఉన్న బస్‌షెల్టర్‌ నిరుపయోగంగా మారింది. నియోజకవర్గ నేతలు ఇక్కడి నుంచే రాజకీయ ముహూర్తాలు చేస్తున్నా, దీన్ని పట్టించుకోవడం లేదు. మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. – బొంరాస్‌పేట



బెల్టు షాపుపై దాడులు

శంకర్‌పల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై సోమవారం మోకిల పోలీసులు దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. మోకిల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్‌లో భూక్యా బబ్లు అనే వ్యక్తి దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 91మద్యం సీసాలను సీజ్‌ చేశారు. కాగా, అదే ప్రాంతంలో ప్రభుత్వం నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న కాంత్‌జైస్వాన్‌కు కూడా అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 16మాంజాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

భార్యను చంపిన వ్యక్తికి జీవితఖైదు

తలకొండపల్లి: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తి హారీష తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లికి చెందిన జంగయ్య, లావణ్య భార్యాభర్తలు. వ్యసనాలకు బానిసగా మారిన జంగయ్య వేరే మహిళలతో వివాహేతర సంబంధాలు కొనసాగిస్తూ భార్యను హింసించసాగాడు. 2021 డిసెంబర్‌ 17న ఇంట్లో ఎవరూ లేని సమయంలో లావణ్య తలను బలంగా గోడకు కొట్టి చంపాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్న ప్రకారం ఆమెపై దాడికి పాల్పడ్డాడు. చెవిలో నుంచి రక్త స్రావం కావడంతో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. లావణ్య సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఎల్బీనగర్‌ జిల్లా సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి జీవిత కాల జైలు శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన సీఐ ఉపేందర్‌, ఎస్‌ఐ వరప్రసాద్‌, లైసన్‌ అధికారి జానయ్య, పీపీ రఘు, కోర్టు కానిస్టేబుల్‌ అవినాష్‌కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రజాధనాన్ని దోచుకున్న బీఆర్‌ఎస్‌

- అడ్డగోలు జీఓలతో ప్రజలను మభ్య పెట్టారు
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- ‘ప్రజాపాలన’లో నియోజకవర్గంలో 73 వేల దరఖాస్తులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: రాష్ట్రంలో పదేళ్లుగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొరల పాలన పోయి కాంగ్రెస్‌ పార్టీ ప్రజల పాలనను తీసుకొచ్చిందని.. దీంతో ప్రజలు సంతోషిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ప్రజలు అధికారులు పూర్తి స్వేచ్ఛ వాతావరణం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లలో రెండింటిని అమలు చేశామన్నారు. మిగతా నాలుగు స్కీమ్‌లను అమలు చేసేందుకు ప్రజాపాలన నిర్వహించి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలోనే తాండూరు నియోజకవర్గం ముందు వరుసలో నిలవడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో మొత్తం 53వేల కుటుంబాలు ఉన్నాయన్నారు. ప్రజాపాలనలో గ్యారంటీ స్కీమ్‌ల కోసం 73 వేల దరఖాస్తులు స్వీకరించారన్నారు. వంద రోజుల వ్యవధిలో స్కీమ్‌లు ప్రజలకు అందుతాయన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటకముందే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్‌లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ పార్టీకే దక్కిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి జీఓలు తీసుకొచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో విజన్‌ ప్రకారమే ముందుకు వెళ్తున్నానన్నారు. తాండూరు నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్‌ల రొడ్డు వేశామన్నారు. ప్రమాదాలను నివారించేందుకు త్వరలో బైపాస్‌ రోడ్డు పనులు సమీక్షించి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకొంటానన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, బషీరాబాద్‌ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌లు రవిగౌడ్‌, సురేందర్‌రెడ్డి, పెద్దేముల్‌ వైస్‌ ఎంపీపీ మధులత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులున్నారు.

హైకోర్టుకు వర్సిటీ భూములను కేటాయించవద్దు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందకిశోర్‌ గుప్తా

శంషాబాద్‌: కొండా లక్ష్మణ్‌ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని హై కోర్టుకు కేటాయించిన ఉత్తర్వులను రాష్ట్ర సర్కారు రద్దు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌ గుప్తా, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిలు డిమాండ్‌ చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వర్సిటీ భూములు ఇతర రంగాలకు కేటాయిస్తే వ్యవసాయ, ఉద్యానవన రంగాల్లో పరిశోధనలు ఆగిపోతాయని అన్నారు. ప్రేమావతిపేట, బుద్వేల్‌కు చెదిన రైతులు తమ సొంత భూములను అప్పట్లో వర్సిటీకి అందజేశారన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికే అనేక సంస్థలకు స్థలాలు కేటాయించడంతో వర్సిటీ భూము చాలా వరకు తగ్గిపోయిందన్నారు. హైకోర్టుకు ప్రత్యామ్నయంగా శంషాబాద్‌లో ఉన్న హెచ్‌ఎండీఏకు చెందిన సర్వేనంబరు 725లో వంద ఎకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి సరైన నిర్ణయం తీసుకోకపోతే బీజేపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

షాద్‌నగర్‌రూరల్‌: కన్నబిడ్డలను కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లి మద్యానికి బానిస అయింది. కుటుంబాన్ని మరిచి మద్యం మత్తులో జీవితాన్ని చిత్తు చేసుకుంది. తాగుడుకు డబ్బులు ఇవ్వాలని ప్రతిరోజు తనయుడితో గొడవ పడేది. మద్యం మత్తులో ఆమె అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కేశంపేట రోడ్డులో సుగుణ(42) తన కుమారుడు శివకుమార్‌తో కలిసి నివాసం ఉంటుంది. కొంత కాలంగా ఆమె మద్యానికి బానిస కావడంతో శివకుమార్‌ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమె మద్యం తాగేందుకు ఉన్న బంగారాన్ని అమ్ముకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం తల్లీకూమారులకు ఘర్షణ జరిగింది. మరుసటి రోజు తనయుడు ఉదయం ఆమెను నిద్రలేపగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి కూతురు నందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీఎం జన్‌మన్‌తో ఆదివాసీలకు మేలు



చెంచులతో సమావేశమైన అధికారులు, ప్రజాప్రతినిధులు

డీటీడీవో రామేశ్వరి దేవి

- కడ్తాల్‌లో చెంచులతో సమావేశం

కడ్తాల్‌: ఆదివాసీ చెంచుల అభ్యున్నతే లక్ష్యంగా, వారికి మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌(పీఎం–జన్‌మన్‌) కార్యక్రమం ప్రవేశ పెట్టిందని జిల్లా గిరిజన సంక్షేమాభివృద్ధి శాఖ(డీటీడీవో) అధికారిణి రామేశ్వరి దేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చెంచు కాలనీలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించి చెంచులతో సమావేశమయ్యారు. చెంచు కుటుంబాల ఆర్థిక పరిస్థితి, స్థితి గతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీటీడీవో మాట్లాడుతూ.. జన్‌మన్‌ పథకం కింద చెంచులు పొందాల్సిన ప్రయోజనాలు, కనీస సౌకర్యాలపై వారికి ప్రత్యేక అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 15న మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో జన్‌మన్‌ పథకంపై ప్రధానమంత్రితో వర్చువల్‌ మీటింగ్‌(వీడియో కాన్ఫరెన్స్‌) ఉంటుందని, ఈ కార్యక్రమానికి కడ్తాల్‌, ఆమనగల్లు మండలాల్లోని 11 గ్రామాల్లో ఉంటున్న చెంచులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ ముంతాజ్‌, సీడీపీఓ సక్కుబాయి, ఏవో శ్రీలత, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నర్సింహారెడ్డి, నరేందర్‌, శ్రీనివాస్‌, రాంచంద్రయ్య, ఏపీఎం రాజేశ్వరి, సర్పంచ్‌ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్‌ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌ విండో డైరెక్టర్‌ వెంకటేశ్‌, నరేందర్‌రెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.